క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



అల్లూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని కార్యాలయానికి వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఎంపీడీఓ రజనీకాంత్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూరు: జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ శేషారత్నం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు ప్రారంభించిన తరువాత తొలిసారిగా నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. వైద్యులు ఉషాసుందరి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రావణసేవ



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి రావణసేవను వైభవంగా నిర్వహించారు. కామాక్షితాయి, సంగమేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రావణ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

చెన్నకేశవునికి హనుమంతసేవ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. పాతూరుకు చెందిన భక్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

రూ.77వేలు రికవరీకి ఆదేశం



సంగం: మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 20 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్లతో ఉపాధి పనులను చేపట్టారు. ఆయా పనులను తనిఖీ చేసి గుర్తించిన అవకతవకలను సామాజిక తనిఖీ బృందాలు ప్రజావేదికలో చదివి వినిపించాయి. డ్వామా పీడీ గంగా భవాని అవకతవకలపై విచారణ జరిపి రూ.77వేలు రికవరీకి ఆదేశించారు. ఎంపీడీఓ షాలెట్, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి)/ సోమశిల/ ఆత్మకూరు(చేజర్ల): గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని వింజమూరు, అనంతసాగరం సీడీపీఓలు పద్మజా కుమారి, పద్మావతి సూచించారు. వింజమూరులోని బీసీకాలనీ, అనంతసాగరం మండలం మినగల్లు, పాతదేవరాయపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో వారు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేజర్ల మండలం మాముడూరులోని అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం షేక్ జమీల, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం కామేశ్వరి పోషకాహారంపై అవగాహన కల్పించారు.

సాయిబాబాకు విశేష పూజలు

వరికుంటపాడు: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో ద్వితీయ వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సుంకర వెంకటాద్రి, సుజన దంపతుల ఆధ్వర్యంలో సాయిబాబాకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సాయిబాబాను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రజారవాణా సంస్థ బస్సుల్లో కనిపించని ఫస్ట్ఎయిడ్ కిట్లు

- కొన్ని బస్సుల్లో ఖాళీగా బాక్సులు
- మరికొన్నింటిలో గడువు తీరిన మందులు దర్శనం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- నిర్లక్ష్యం వీడాలంటున్న ప్రయాణికులు

అలంకారప్రాయంగా ఫస్ట్ఎయిడ్ బాక్సులు

సీతారామపురం : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యం.. ఇది తమ నినాదంగా చెప్పుకునే ప్రజారవాణా సంస్థ అధికారులు బస్సుల్లో ఫస్ట్ఎయిడ్ బాక్సుల నిర్వహణపై శ్రద్ధ చూపడంలేదు. బస్సు రోడ్డు ప్రమాదానికి గురైతే అప్పటికప్పుడు తాత్కాలిక వైద్య సేవలు పొందేందుకు ప్రతి ఆర్టీసీ బస్సులో ఫస్ట్ఎయిడ్ బాక్స్ ఉండాలి. కానీ జిల్లాలో వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ఎయిడ్ బాక్సులు అలంకారప్రాయంగా మాత్రమే దర్శనమిస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ఎంతో అవసరం. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మొదటి 15 నిమిషాలు ఎంతో విలువైనవి. క్షతగాత్రుల ప్రాణాలను కాపాడాలంటే ఆ సమయంలో చేసే ప్రథమ చికిత్స ఎంతో కీలకం. దీన్ని దృష్టిలో ఉంచుకుని మోటారు వాహనాల చట్టంలో అన్ని వాహనాల్లోనూ ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచాలనే నిబంధనను పెట్టారు. కానీ ప్రభుత్వ నిర్వహణలోని ప్రజారవాణా సంస్థ బస్సుల్లో మాత్రం ఫస్ట్ఎయిడ్స్ బాక్సుల నిర్వహణ అధ్వానంగా ఉంది. అధిక శాతం బస్సుల్లోని ప్రథమ చికిత్స బాక్సుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో ఉన్నా గడువు తీరి ఉన్నాయి. కొన్ని బస్సుల్లో ఫస్ట్ఎయిడ్ బాక్సుల్లో ఇతర వస్తువులు కనిపిస్తున్నాయి.





ఉదయగిరి-సీతారామపురం బస్సులో ఖాళీగా ఫస్ట్ఎయిడ్‌బాక్స్



ఉదయగిరి డిపో బస్సులోని ఫస్ట్ ఎయిడ్‌కిట్‌లో ఉన్న కాలం చెల్లిన మందు

అమలు కాని కేంద్ర మోటారు వాహన చట్టం

కేంద్ర మోటారు వాహన చట్టం–1939 ప్రకారం వాహనాల్లో విధిగా ప్రథమ చికిత్స బాక్సులు ఉండాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర వస్తువులను ప్రథమ చికిత్స బాక్సుల్లో ఉంచాలి. ప్రయాణికులు గాయపడితే ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉండాలి. బస్సు లైసెన్స్ పొందే ముందు బస్సు డ్రైవర్, కండక్టర్ తప్పనిసరిగా వారం రోజులపాటు ప్రథమ చికిత్సపై శిక్షణ పొందాలి. ప్రతి మూడేళ్లకోసారి లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలని కూడా చట్టం నిర్దేశిస్తుంది. రవాణా శాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్స కిట్లను చూపుతున్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. బస్సులు నడిపేటప్పుడు అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే ప్రయాణికులు గాయపడే సందర్భాలు ఉంటాయి. అలాంటప్పుడు ప్రథమ చికిత్స కిట్టు ఉంటే కొంతమేర ఉపశమనం ఉంటుంది.

పట్టించుకోని అధికారులు

ఫస్ట్ఎయిడ్ బాక్సుల్లో మందులు ఏర్పాటు చేయకపోతే బస్సులను సీజ్ చేసే అధికారం ఆర్టీఓ స్థాయి అధికారులకు ఉంటుంది. అయినప్పటికీ ప్రజారవాణా సంస్థ బస్సులు ప్రభుత్వానికి చెందినవేనన్న భావనతో రవాణా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సు లైసెన్స్‌ల కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లినప్పుడు మాత్రమే అలంకారప్రాయంగా ప్రథమ చికిత్స కిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత మళ్లీ కనిపించడం లేదు. ప్రతి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిస్పెన్సరీ ఉంది. అవి లేని చోట జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ఆస్పత్రులకు ఇండెంట్ పెట్టి కిట్లను తీసుకోవచ్చు. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్సులు, ఇతర వాహనాల కోసం ఎదురుచూడడం తప్ప మరో దారి లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజారవాణా సంస్థ అధికారులు ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించి ఫస్ట్ఎయిడ్ బాక్సుల్లో మందులను నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫస్ట్ఎయిడ్ బాక్సులో ఉండాల్సినవి

బ్యాండేజ్ రోల్స్	- 5
నియోమైసిన్ ఆయింట్‌మెంట్	- 1
స్టెరిలైజ్డ్ కాటన్ రోల్స్	- 2
పోవిడిప్ పౌడర్ డబ్బా	- 1
ఎక్సలోన్ (ఆయిల్)	- 1
నార్మల్ బ్లేడ్	- 1
సిల్వరైజ్ ఫ్లస్ఆయింట్‌మెంట్	- 1
పేపర్ ప్లాస్టర్	- 1
బ్యాండ్ ఎయిడ్ ప్లాస్టర్లు	- 4

జిల్లాలో ఆర్టీసీ డిపోలు	- 7
నిత్యం ప్రయాణించే బస్సులు	- 603
ప్రయాణించే దూరం	- 2.34 లక్షల కి.మీ.
ప్రయాణికుల సంఖ్య	-1.50 లక్షలు

మందులు లేవు



ప్రజారవాణా సంస్థ బస్సుల్లో ఫస్ట్ఎయిడ్ బాక్సులు అలంకారప్రాయంగా ఉంటున్నాయి. ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఉండడం లేదు. ప్రమాదాలు జరిగిన సమయంలో మందులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉంచాలి.

–బొంత శివయ్య, ప్రయాణికుడు, అయ్యవారిపల్లి

కిట్లు ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు ఉండడం లేదు. ప్రభుత్వ బస్సుల్లోనే నిబంధనలు పాటించకపోతే ప్రైవేటు బస్సుల నిర్వాహకులు ఏమి పాటిస్తారు. ఇప్పటికైనా ప్రజారవాణా సంస్థ అధికారులు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలి.

–ఆదోని ఏడుకొండలు, ప్రయాణికుడు, సీతారామపురం.

కిట్లు అందుబాటులో ఉంచుతాం



ప్రజారవాణా సంస్థ బస్సుల్లో ఫస్ట్ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుతాం. ఫస్ట్ఎయిడ్ బాక్సులకు తాళాలు వేయించి అత్యవసర సమయాల్లో తెరిచి ప్రథమ చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటాం. డ్రైవర్లు, కండక్టర్లు ప్రతినెలా బాక్సులను తనిఖీ చేసి అందులోని గడువు తీరిన మందుల స్థానంలో కొత్తవి ఉంచేలా చర్యలు చేపడుతాం.

మురళీబాబు, జిల్లా ప్రజా రవాణా సంస్థ అధికారి.

రైతుల సమస్యలపై నిరంతర పోరాటం



జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ సమీపంలోని వార్డు సచివాలయం వద్ద ఆల్ ఇండియా కిసాన్ మోర్చా 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆత్మకూరు నియోజకవర్గ నాయకుడు చేవూరు రామకృష్ణారెడ్డి పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. 1936 ఏప్రిల్ 11న ఆవిర్భవించిన ఆల్ ఇండియా కిసాన్ మోర్చా తొమ్మిది దశాబ్దాలుగా రైతుల పక్షాన నిరంతరం పోరాటాలు సాగిస్తూ వారికి అండగా నిలుస్తోందన్నారు. దానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చేస్తున్న కృషిని వివరించారు. ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కేవీ శేషారెడ్డి, టీడీపీ రైతు సంఘం నాయకుడు తుమ్మల చంద్రారెడ్డి, కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు లక్కు కృష్ణప్రసాద్, కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.

పంటకుంటల నిర్మాణంతో బహుళ ప్రయోజనాలు



పంట కుంటలను పరిశీలిస్తున్న గోపీచంద్

ఆత్మకూరు రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్మిస్తున్న పంటకుంటల వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఉపాధి హామీ పథకం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్ అన్నారు. ఆత్మకూరు మండలం నబీనగరంలో జరుగుతున్న పనులను డ్వామా పీడీ గంగా భవానీతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటకుంటల నిర్మాణంతో వ్యవసాయ సుస్థిరత పెరుగుతుందన్నారు. నీటి కొరతను తగ్గించి ఏడాది పొడవునా పంటలు సాగు చేయొచ్చన్నారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మెట్ట భూముల్లో వర్షపునీరు నిల్వ చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్, ఉపాధి ఏపీడీ శంకర్ నారాయణ, ఏపీఓ మధుసూదన్, టీఏలు, ఎఫ్ఏలు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామికి పడిపూజ

కలిగిరి: అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాళెంలో ఉన్న తిప్పవద్ద నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి మందిరంలో గురుస్వాముల ఆధ్వర్యంలో శుక్రవారం పడిపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు చేశారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిప్ప వద్ద నుంచి కలిగిరి తహసీల్దార్ కార్యాలయం వరకు అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని కాశీనాయన ఆశ్రమంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎన్ఎంయూ ధర్నా

ఆత్మకూరురూరల్/ఉదయగిరి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజారవాణా సంస్థ ఉద్యోగులు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆత్మకూరు, ఉదయగిరి డిపోల ఎదుట రెండోరోజు శుక్రవారం కూడా ధర్నాను కొనసాగించారు. ఆత్మకూరులో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి మస్తానయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజారవాణా సంస్థగా రూపాంతరం చెంది ప్రభుత్వంలో విలీనమైనందున అన్ని ప్రభుత్వ పాలసీలను ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఉదయగిరిలో ఎన్ఎంయూ డిపో కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఉపాధ్యక్షుడు శివశంకర్, జోనల్ నాయకుడు సలాం మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాని, అక్రమ సస్పెన్షన్లను ఆపాలని, ఆర్టీసీలోని ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, మహిళలకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, నైట్ అలవెన్స్‌లను రూ.400కు పెంచాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్‌చేశారు. ఆత్మకూరు నాయకులు పద్మారావు, గౌస్‌బాషా, సుధీర్, ఉదయగిరి డిపో కార్యదర్శి కాశీవిశ్వనాథ్, గ్యారేజీ కార్యదర్శి ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



ట్రస్ట్‌ను ప్రారంభించి నిర్వాహకులను అభినందిస్తున్న మేకపాటి, బొమ్మిరెడ్డి

ఆత్మకూరు: వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జేఆర్ పేటలో వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్టు కార్యాలయాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ట్రస్టు నిర్వాహకులు వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్, హారిక దంపతులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం జేఆర్‌పేటలో జరిగిన గోపిరెడ్డి రామిరెడ్డి కుమారుడి వివాహానికి మేకపాటి, బొమ్మిరెడ్డి హాజరై వరుడ్ని ఆశీర్వదించారు. అనంతరం హిల్ రోడ్డు 11వ వార్డులో బూదళ్ల ప్రశాంత్‌రెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న హిల్‌రోడ్డుకు చెందిన చీర్ల వెంకట సుబ్బయ్యను పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న 4వ వార్డు కౌన్సిలర్ కోడూరు కౌసల్యమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులు మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, మేకపాటి దీప్తి దంపతులను అడిగి తెలుసుకున్నారు. కాగా విక్రమ్‌రెడ్డిని హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులు కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. పట్టణంలో జరిగే హనుమాన్ శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు.

341 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 341 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 471 బేళ్లు రాగా, 341 బేళ్లను విక్రయించామని చెప్పారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.230, సగటున రూ.262.65గా ధర పలికిందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు : విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ షేక్ జమీలాబేగం శుక్రవారం తెలిపారు.

మర్రిపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ హరికృష్ణ తెలిపారు.

సంగం: సంగంలో సంగమేశ్వరస్వామి రథోత్సవం జరిగే ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మన్మధరావు శుక్రవారం తెలిపారు.

సీతారామపురం: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీహరి శుక్రవారం తెలిపారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం



వరికుంటపాడులో సీతారాముల కల్యాణోత్సవం



గుండెమడకలలో సీతారాముల రథోత్సవం

జలదంకి: మండలంలోని గోపన్నపాళెంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, పార్వేట ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా గండు వెంకారెడ్డి, గండు కృష్ణారెడ్డి వ్యవహరించారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

వరికుంటపాడు: వేంపాడు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురంలో సీతారాముల సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వరికుంటపాడులో కోదండరామస్వామికి గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించారు.

వైభవంగా హనుమంత సేవ



ఆత్మకూరులో హనుమంత సేవ

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్యవైశ్యుల కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా హనుమంత సేవను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కృష్ణం హనుమోజి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఉదయగిరి(వింజమూరు): వింజమూరు మండలం గుండెమడకలలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి



ఆత్మకూరు: పూలేకు నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి



చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో..



సోమశిల: చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో..

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్/ అనుమసముద్రంపేట/సంగం/సోమశిల: సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావుపూలే ఎనలేని కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మేకపాటి కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతిని గురువారం నిర్వహించారు. జ్యోతిరావుపూలే చిత్రపటానికి జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కలిసి విక్రమ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు షేక్ పర్వీన్, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సయ్యద్ జమీర్, కలాం, ముతీవర్, రిజ్వాన్, కల్పన, మర్రిపాడు మాజీ కన్వీనర్ సుబ్బిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, చేజర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బీ మురళి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, సంగం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్, అనుమసముద్రంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్ ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సురేష్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి/కలిగిరి/సీతారామపురం : ఉదయగిరి పోలీసు స్టేషన్ ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అప్పాజీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, కలిగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కలిగిరి ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, జూనియర్ అసిస్టెంట్ దీక్షితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, సీతారామపురం దళిత నాయకులు కలివెల ఎలీషాకుమార్, నేలటూరి జాషువా, జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షుడు బొగ్గవరపు రత్నం, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో..



సీతారామపురం ఎంపీడీఓ కార్యాలయంలో..



వింజమూరు ఎంపీడీఓ కార్యాలయంలో..

గ్యాస్ ధరలను తగ్గించాలని నిరసన



ఉదయగిరి: పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. నాయకులు ప్రసాద్, వెంకటసుబ్బారెడ్డి, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.